7TV ఫోకస్ న్యూస్

విలేకరులు కావలెను

7TV ఫోకస్ న్యూస్

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న 7tv ఫోకస్ న్యూస్ పత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సాహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 94906 17567

ఎడిటర్ : మరే చిన్న బాబు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 19 గురువారం , ఆగస్టు 06, 2026 , పేజీలు - 5 వెల : 2 /-

మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ

ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి

ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు

ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన

దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ



2లో.

తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..



తుమ్మిడిహట్టి పెంపునకు ఒత్తడి తెండి

మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి

అటవీ పర్యావరణ అనుమతులపై భూపేంద్రయాదవ్‌తో చర్చ

ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

న్యూఢిల్లీ, ఆగస్టు 5 :
తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు.150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**

తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

గోదావరి రివర్ బోర్టు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్,ఆగస్టు 5 :
ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం **మిగతా 2లో...**



తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

డయల్ 112తో అన్ని సేవలు

ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు

హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ

కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం

సమీప బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకునేలా చర్యలు

ఏడాది పాడవునా 24 గంటలు 112 సేవలు అందుబాటులో

అత్యవసర సేవల్లో ఏఐ వినియోగాన్ని పెంచనున్నట్లు డీజీపీ వెల్లడి



2లో.

విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

ఇది బహుళ క్రీడా కేంద్రం, సీఎం చంద్రబాబు సూచనతోనే రూపకల్పన

సంస్థలే ఛాంపియన్లను నిర్మిస్తాయని, క్రీడలు వ్యక్తిత్వాన్ని పెంచుతాయని వ్యాఖ్య

ఏపీని క్రీడాకారులను తయారు చేసే గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యం

ప్రతి బిడ్డలో స్ఫూర్తి నింపిన సింధుకు లోకేశ్ అభినందనలు

2లో.



రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

: కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్

అమరావతి,ఆగస్టు 5 :
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని **మిగతా 2లో...**



22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి

అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి

జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు



హైదరాబాద్,ఆగస్టు 5 :
రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత **మిగతా 2లో...**

రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం

సిజెపి నేత అభిజిత్ బీప్కే స్పష్టీకరణ

ముంబై, ఆగస్టు 5(పిసిడబ్ల్యూ న్యూస్):
జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు **మిగతా 2లో...**



హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..



8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

నకిలీ ఎన్ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు

పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

హైదరాబాద్,ఆగస్టు 5 :
హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్ఓసీ' (చీజ) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను **మిగతా 2లో...**

అమెరికాలో భారతీయుల ఘనత..

'ఇండియా డే'గా ప్రకటిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ ఉత్తర్వులు!

ప్రవాస భారతీయుల సేవలకు గుర్తింపుగా గవర్నర్ మౌరా హీలీ ప్రకటన

బోస్టన్ నగరంలోనూ 'ఇండియా డే'గా పాటిస్తూ మేయర్ ఉత్తర్వులు

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భారత సంఘాల సన్నాహాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5 :
అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని 'ఇండియా డే'గా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం **మిగతా 2లో...**



రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

మొదటిపేజీ తరువాయి

ఆయన ఆరోపించారు.పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. “మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు“ అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.

గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

అమెరికాలో భారతీయుల ఘనత..

మొదటిపేజీ తరువాయి

పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు.1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వైద్యం, టెక్నాలజీ, విద్య, వ్యాపారం వంటి రంగాల్లో ఇండియన్-అమెరికన్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3.6 కోట్ల మంది ప్రవాస భారతీయుల పాత్రను ఆమె గుర్తుచేశారు.మరోవైపు, బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15ను ‘ఇండియా డే’గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.బోస్టన్‌లో కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమె స్వాగతించారు.గవర్నర్, మేయర్ల నిర్ణయంపై ‘ఇండియా అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్‘ (ఐఏజీబీ) వంటి భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బోస్టన్ హార్బర్ వద్ద భారీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అమెరికా గడ్డపై భారతీయ సమాజానికి లభించిన ఈ గౌరవం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

మొదటిపేజీ తరువాయి

ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

హైదరాబాద్,ఆగస్టు 5

తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు.ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..

మొదటిపేజీ తరువాయి

తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే:

శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట,రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్
హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర,ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం
న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి,మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్
షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి, వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

మొదటిపేజీ తరువాయి

ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు.

తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

మొదటిపేజీ తరువాయి

150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్‌ఎస్ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

అమరావతి,ఆగస్టు 5 :

ఒలింపిక్ పతకాలను అథ్లెట్లు గెలుస్తారని, కానీ ఆ ఒలింపిక్ కలలను సాకారం చేసేది అకాడమీలేనని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పీవీ సింధు అకాడమీ అలాంటి ఛాంపియన్లను తయారుచేసే గొప్ప సంస్థగా ఎదుగుతుందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం విశాఖపట్నంలో ‘పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‘ శంకుస్థాపన కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ అకాడమీ కేవలం ఒక భవనం కాదని, భావి భారత ఛాంపియన్లకు పునాది అని ఆయన అభివర్ణించారు.ఈ అకాడమీ ఏర్పాటు వెనుక ఉన్న స్ఫూర్తిదాయక నేపథ్యాన్ని లోకేశ్ వివరించారు. “పీవీ సింధు తన హృదయానికి దగ్గరైన ఒక కలతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఒక బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మించాలనే తన ఆశయాన్ని పంచుకున్నారు. కానీ, మన ముఖ్యమంత్రి ఎప్పుడూ ఉన్నదాని కంటే గొప్పగా ఆలోచించమని సవాల్ విసురుతారు. ఆయన సింధుతో ‘కేవలం బ్యాడ్మింటనే ఎందుకు? అంతకు మించి ఆలోచించు. వివిధ క్రీడల్లో నైపుణ్యం ఉన్న పిల్లలందరికీ శిక్షణ ఇచ్చే ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మించు‘ అని ప్రోత్సహించారు. ఈ రోజు మనం చూస్తున్న ఈ బృహత్ కార్యం ఆ దార్శనికతకు ప్రతిరూపం“ అని లోకేశ్ తెలిపారు. ఇది కేవలం ఒక సౌకర్యం నిర్మించడం కాదని, ఒక వారసత్వాన్ని నిర్మించడం అని ఆయన అన్నారు.

ప్రభుత్వ విధానాలను వివరిస్తూ, చదువుతో పాటు క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. “తరగతి గది జ్ఞానాన్ని నిర్మిస్తే, క్రీడా మైదానం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది. అందుకే రాష్ట్రంలోని పాఠశాలల్లో శనివారాలను ‘నో బ్యాగ్ డే’గా ప్రకటించాం. విద్యార్థులకు నచ్చిన క్రీడను ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చి, వారికి అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తున్నాం“ అని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, గౌరవం, ఓటమిని ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పుతాయని, అందుకే ప్రతి బిడ్డ ఒక క్రీడ ఆడాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో సైబర్ సిటీ నిర్మిస్తున్నప్పుడు చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారని, కంప్యూటర్లు కడుపు నింపుతాయా అని ప్రశ్నించారని లోకేశ్ గుర్తుచేశారు. “కానీ ఆ ఒక్క భవనం హైదరాబాద్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికింది. అదేవిధంగా, ఈ అకాడమీ కూడా ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను“ అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ దత్తాత్రేయకు 18 నెలల గడువు విధిస్తూ, 2028 మే నాటికి రిబ్బన్ కటింగ్ ఉండాలని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌ను కేవలం గొప్ప విద్యార్థులు, పరిశ్రమలకే కాకుండా, గొప్ప క్రీడాకారులను తయారుచేసే గమ్యస్థానంగా మార్చడమే తమ కల అని లోకేశ్ అన్నారు. “ఈ అకాడమీ గేట్ల నుంచి ఒకనాడు ఆశతో అడుగుపెట్టిన చిన్నారి, కొన్నేళ్ల తర్వాత ఒలింపిక్ వేదికపై మన మువ్వన్నెల జెండాను మోస్తుంది. ఆ ప్రయాణం ఇక్కడే ప్రారంభమైందని మనమందరం గుర్తుంచుకుంటాం. ‘సింధు చేయగలిగితే, నేను కూడా చేయగలను‘ అని ప్రతి బిడ్డ నమ్మాలి“ అని పిలుపునిచ్చారు. విశాఖను ఎంచుకున్నందుకు సింధుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ

ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి

ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు

ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన

దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ

న్యూఢిల్లీ, ఆగస్టు 5 :

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం తర్వాత రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాణిజ్య అనిశ్చితి దృష్ట్యా తటస్థ వైఖరినే కొనసాగిస్తున్నట్టు వెల్లడించింది. రెపో రేటులో మార్పు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న హోమ్ లోన్, వాహన రుణం, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు వెంటనే పెరగవు. కొత్త రుణాలపై కూడా బ్యాంకులు ప్రస్తుత వడ్డీ రేట్లనే కొనసాగించే అవకాశం ఉంది.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. అమెరికా కొత్త సుంకాలు విధించడం వల్ల ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతోందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రభావంతో ముడి చమురు ధరలు, ఆర్థిక మార్కెట్లు ఇంకా ఒడుదొడుకులకు లోనవుతున్నాయని చెప్పారు.

స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతంగానే కొనసాగించారు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటును 5.5 శాతంగా యథాతథంగా ఉంచారు.

ద్రవ్యోల్బణం ఇటీవల కొంత పెరిగినా ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితుల్లోనే ఉందని గవర్నర్ తెలిపారు. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి మారకపు విలువలో మార్పులు, పశ్చిమాసియా పరిణామాలు ఆర్‌బీఐ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్న ప్రధాన అంశాలుగా పేర్కొన్నారు.

మరోవైపు దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. వృద్ధి రేటులో ఊపు కొనసాగడం, సానుకూల వర్షపాతం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని వెల్లడించింది.

అయితే కొన్ని రంగాల్లో ప్రారంభ దశ ఒత్తిడి కనిపిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి అంచనాల చుట్టూ ఇంకా గణనీయమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని వ్యాఖ్యానించారు.

జూన్‌లో జరిగిన గత ఎంపీసీ సమావేశంలో కూడా రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించారు. అదే సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. ప్రపంచ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ఇంధన ధరల పెరుగుదల ఇందుకు కారణాలని అప్పట్లో పేర్కొంది.

తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

మొదటిపేజీ తరువాయి

ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జీఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోనమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్దా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ

ఖాళీ పొలాల్లో పీఎండీఎస్ విత్తనాల చల్లింపు -- కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమం



తుగ్గలి, ఆగస్టు 5 (7టీవీ ఫోకస్ న్యూస్):జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న వ్యవసాయ పొలాల్లో పీఎండీఎస్ విత్తనాలను చల్లే కార్యక్రమాన్ని బుధవారం సంబంధిత అధికారులు సమన్వయంతో నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పశువులకు పచ్చిమేత లభ్యత పెంపు, ఖాళీ భూములను సద్వినియోగం చేసుకోవడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ముందుగా పీఎండీఎస్ విత్తనాల కిట్లను సిద్ధం చేసి రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఖాళీగా ఉన్న పొలాల్లో విత్తనాలను చల్లించి, వాటి సాగు విధానం, నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో పచ్చిమేత కొరతను అధిగమించడంతో పాటు పశుసంపద అభివృద్ధికి దోహదం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లక్ష్మీనారాయణ, ఏపీ సీఎం లింగప్ప, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు రైతులు కార్యక్రమంలో పాల్గొని విత్తనాల చల్లింపు ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ, పశు సంవర్ధక కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.


సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తా: మాజీ సీఎం వైఎస్ జగన్‌తో భేటీ అనంతరం చెక్క శ్రీను



తుగ్గలి, ఆగస్టు 5(7టీవీ ఫోకస్ న్యూస్):తుగ్గలి మండలంలోని చిన్న జొన్నగిరి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు చెక్క శ్రీను బుధవారం మంగళగిరిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తుగ్గలి మండలంతో పాటు చిన్న జొన్నగిరి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక పరిస్థితులు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను మాజీ ముఖ్యమంత్రికి వివరించినట్లు చెక్క శ్రీను తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా చర్చించినట్లు పేర్కొన్నారు.అనంతరం చెక్క శ్రీను మాట్లాడుతూ, ప్రజలతో ఎల్లప్పుడూ మమేకమై వారి కష్టసుఖాల్లో అండగా నిలవాలని, సేవా దృక్పథంతో ముందుకు సాగాలని మాజీ ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం పనిచేయాలని ఆయన ఇచ్చిన సందేశం తనకు మరింత స్ఫూర్తినిచ్చిందన్నారు.మాజీ ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా కలిసి ఆశీస్సులు పొందడం తన రాజకీయ జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని చెక్క శ్రీను పేర్కొన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తూనే, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రికి చెక్క శ్రీను కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టేందుకు కట్టుబడి ఉంటానని వెల్లడించారు.

దళితుల సమస్యలపై వైఎస్ జగన్‌కు వినతి

మాజీ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీ ఎంఆర్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చెక్క పక్కీరప్ప



తుగ్గలి, ఆగస్టు 5 (7టీవీ ఫోకస్ న్యూస్):ఏపీ ఎంఆర్పీఎస్ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి చెక్క పక్కీరప్ప బుధవారం విజయవాడ సమీపంలోని మంగళగిరిలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలపై ఆయన మాజీ ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, దళితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరినట్లు పేర్కొన్నారు.దీనిపై స్పందించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి, దళితుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు తమ పార్టీ కట్టుబడి ఉందని చెప్పినట్లు చెక్క పక్కీరప్ప తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, బాధితులకు అండగా నిలిచే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నట్లు వెల్లడించారు.అనంతరం చెక్క పక్కీరప్ప మాట్లాడుతూ, దళితుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు. స్థానిక ప్రజల సమస్యలను సంబంధిత వేదికలపై ప్రస్తావిస్తూ న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి:

తిమ్మయ్య చౌదరి



తుగ్గలి,ఆగస్టు,01:(7టీవీ ఫోకస్ న్యూస్) మండల పరిధిలోని గిరిగట్ల గ్రామంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా నాయకుల ముందుకు సాగుతున్నారు మండల పరిధిలోని గిరిగట్ల గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి తెలియచేశారు.ఈ సందర్భంగా తిమ్మయ్య చౌదరి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రచారం పత్రమును పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న తిమ్మయ్య చౌదరి ప్రజలందరూ అండగా ఉంటానని కూటమి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి వచ్చేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా వెల్లడించాడు.ఈ కార్యక్రమాలలో పత్తికొండ అడ్వైజర్ పొలయ్య, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ మెంబర్ వెంకటపతి, తిమ్మయ్య చౌదరి,కొమ్ము వెంకటేష్, రామలింగయ్య, రామచంద్రయ్య,మనోహర్ చౌదరి,ఎద్దులదొడ్డి శ్రీనివాసులు, సతీష్,చంద్ర శేఖర్,వెంకట స్వామి, సత్యప్రకాశ్, మల్లి, రాము నాయక్,సోమశేఖర్, మహేష్,ఎదద్దులదొడ్డి రవి, బలరాముడు రంగస్వామి,మధుబాబు, వెంకటరెడ్డి,వెంకటేశ్వర్లు, బీమలింగ, తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడి, 2/3/, తల్లిపాలు ఆరోగ్యానికి మంచిదని, డాక్టర్ హబీబ్ అన్నారు,,



7 టీవీ న్యూస్ ఫోకస్,,5/8/2026/ నారాయణపేట జిల్లా. మక్తల్, సెంటర్,2/3/ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యత అవగాహన అన్నప్రసా నా, కార్యక్రమం నిర్వహించారు మరియు, ఈ కార్యక్రమంలో,, సుమలత, ఏఎన్ఎం, పరువాన, మరియు అంగన్వాడి టీచర్లు, కే చంద్రకళ, జి వెంకటమ్మ, ఆశా కార్యకర్తలు, సుజాత, పద్మ జయమ్మ, పాల్గొన్నారు

ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి, ఆగస్టు 5 (7టీవీ ఫోకస్ న్యూస్): ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధి, తుగ్గలి మండల ప్రజా సమస్యలు, గ్రంథాల యాల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన వంటి పలు అంశాలను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, విద్యా రంగ ప్రగతిపై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించిన నాగేంద్ర, తుగ్గలి మండల అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి,ప్రజలకు ఉపయోగపడేఅభివృద్ధి కార్యక్రమాలకు ప్రభు త్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ భేటీతో తుగ్గలి మండల అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందనే ఆశాభావాన్ని పార్టీ శ్రేణులు, ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

బరువు తగ్గే ప్రణాళికలో ఉన్నవారు ఈ ఆహారాలను తీసుకోవడం మరిచిపోకండి..!



బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నవారు సాధారణంగా అల్పాహారంపై ఎక్కువ దృష్టి పెడతారు. అయితే మధ్యాహ్న భోజనం కూడా అంతే ముఖ్యమైంది. సరైన ఆహారాన్ని మధ్యాహ్న భోజనంలో చేర్చడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందడమే కాకుండా ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగి, అధికంగా తినే అలవాటు తగ్గుతుంది. దీంతో బరువు నియంత్రణ మరింత సులభతరమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. బరువు తగ్గే లక్ష్యంతో ఉన్నవారు మధ్యాహ్న భోజనంలో తృణధాన్యాలను చేర్చుకోవడం మంచిదని సూచిస్తున్నారు. గోధుమ రొట్టెలు, హోల్ వీట్ శాండ్‌విచ్‌లు లేదా ఓట్స్‌తో చేసిన వంటకాలు తీసుకోవచ్చు. ఇవి ఎక్కువసేపు ఆకలి అవకుండా ఉంచడమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యంగా ఉంచి రోజులో మిగిలిన సమయానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. అయితే ఉదయం అల్పాహారంలో ఇప్పటికే తగిన మోతాదులో తృణధాన్యాలను తీసుకున్నట్లయితే మధ్యాహ్నం వాటి పరిమాణాన్ని తగ్గించుకోవచ్చు.వీటిని తీసుకోవాలి..కూరగాయలు కూడా బరువు తగ్గే ఆహారంలో తప్పనిసరిగా ఉండాల్సినవే. ముఖ్యంగా బ్రోకోలీ, కాలీఫ్లవర్, పాలకూర వంటి కూరగాయలు పోషకాలతో సమృద్ధిగా ఉండటంతో పాటు తక్కువ క్యాలరీలు కలిగి ఉంటాయి. వీటిని ఉడికించి తీసుకోవడం మరింత ప్రయోజనకరమని సూచిస్తున్నారు. అలాగే టమాటా, దోసకాయ వంటి కూరగాయలతో సలాడ్ తయారు చేసుకోవచ్చు. అయితే సలాడ్‌లో మయోనైస్ వంటి అధిక కొవ్వు పదార్థాలు కలిగిన డ్రెస్సింగ్‌లను ఉపయోగించకుండా ఉండటం మంచిది. మధ్యాహ్న భోజనంలో లీన్ ప్రోటీన్లు తప్పనిసరిగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. చికెన్, ట్యూనా, టర్కీ వంటి మాంసాహార పదార్థాలు లేదా శాకాహారులు బీన్స్, టోఫు, పప్పుధాన్యాలను తీసుకోవచ్చు. ఇవి ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగించి, సాయంత్రం చేసే వ్యాయామాలకు అవసరమైన శక్తిని అందించడంలో సహాయపడతాయి.ప్రోబయోటిక్స్ కూడా ముఖ్యమే..ప్రోబయోటిక్స్ ఉన్న ఆహారాలను కూడా మధ్యాహ్న భోజనంలో చేర్చుకోవడం మంచిదని సూచిస్తున్నారు. పెరుగు లేదా యోగర్ట్ వంటి ఆహారాలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. తరచూ గ్యాస్, అజీర్ణం లేదా జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారు భోజనంతోపాటు ఒక గిన్నె రైతా తీసుకోవచ్చు. ప్రోబయోటిక్స్ పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని, ఆరోగ్యకరమైన పేగులు బరువు తగ్గే ప్రక్రియకు తోడ్పడతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరోగ్యంగా ఉండాలంటే ఆయుర్వేద ప్రకారం ఎవరు ఎలాంటి ఆహారం తీసుకోవాలి..?

ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం మంచి ఆహారం తీసుకోవడం మాత్రమే కాదు, ఆ ఆహారం శరీరంలో సరిగ్గా జీర్ణమై పోషకాలుగా మారడం కూడా అంతే ముఖ్యమని ఆయుర్వేదం చెబుతోంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వైద్య విధానం ప్రకారం ప్రతి వ్యక్తి శరీర తత్వం భిన్నంగా ఉంటుంది. అందువల్ల అందరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదని, వ్యక్తిగత శరీర స్వభావానికి అనుగుణంగా ఆహారాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం మంచి ఆరోగ్యానికి మూలం బలమైన జీర్ణవ్యవస్థ. ఆహారం సక్రమంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందించినప్పుడు జీవక్రియలు సమతుల్యంగా పనిచేస్తాయి. వ్యక్తి శారీరక అవసరాలకు అనుగుణంగా తీసుకునే ఆహారం ఔషధంలా పనిచేసి జీవక్రియలను సమతుల్యం చేయడంతోపాటు శరీరానికి ఉత్సాహాన్ని, చైతన్యాన్ని అందిస్తుందని ఆయుర్వేదం పేర్కొంటోంది.మూడు ప్రధాన దోషాలు..మనిషి ప్రకృతిలో భాగమేనని భావించే ఆయుర్వేదం శరీరాన్ని మూడు ప్రధాన దోషాల ఆధారంగా వివరిస్తుంది. అవే వాత, పిత్త, కఫ. ఈ మూడు శక్తులు ప్రతి వ్యక్తిలో వేర్వేరు నిష్పత్తుల్లో ఉంటాయని, వాటి ఆధారంగానే ఆహార అవసరాలు కూడా మారుతాయని చెబుఓంది. అందుకే ఒకరికి అనుకూలమైన ఆహారం మరొకరికి తప్పనిసరిగా సరిపోవాల్సిన అవసరం లేదని వివరిస్తోంది. వాత దోషం అధికంగా ఉన్నవారికి ఉడికించిన ధాన్యాలు, వెన్న, పాల పదార్థాలు, గింజలు, ఉడికించిన కూరగాయలు అనుకూలంగా ఉంటాయి. అయితే పచ్చి సలాడ్లు, ఎక్కువ పండ్లు, బీన్స్ వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవడం మంచిది. పిత్త దోషం ఎక్కువగా ఉన్నవారికి పచ్చి సలాడ్లు, ఉడికించిన ధాన్యాలు, పాలు, విత్తనాలు అనుకూలమైన ఆహారాలు కాగా ఎక్కువ కారం, వేడి పదార్థాలు, పులుపు ఎక్కువగా ఉన్న ఆహారాలు, డీప్ ఫ్రై చేసిన వంటకాలు, పెరుగు, వెనిగర్ వంటి పులియబెట్టిన పదార్థాలను తగ్గించాలి.కఫ దోషం ఉంటే..కఫ దోషం అధికంగా ఉన్నవారు సలాడ్లు, ఉడికించిన కూరగాయలు, మసాలా ఆహారం, క్వినోవా, మిల్లెట్స్, మొక్కజొన్న పిండి, బక్‌వీట్ వంటి ఆహారాలను తీసుకోవడం మంచిది. పాల పదార్థాలు, మాంసాహారం, చీజ్, గింజలు, గోధుమలు, బియ్యం వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. ఆయుర్వేదం సూచించే సాధారణ ఆహార నియమాల్లో తాజా ఆహారానికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. సీజన్‌కు అనుగుణంగా స్థానికంగా పండిన తాజా ఆహారాల్లోనే అధిక పోషకాలు లభిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాల కంటే సహజమైన సంపూర్ణ ధాన్యాలు, సంపూర్ణ పండ్లు, కాలానుగుణ కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం మంచిది.సేంద్రీయ ఆహారాలు మంచివి..సాధ్యమైనంత వరకు సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని ఎంచుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చు. ప్రతి భోజనంలో ఆరు రుచులు ఉండేలా చూసుకోవాలి. తీపి, పులుపు, ఉప్పు, చేదు, కారం, వగరు అనే ఆరు రుచులు సమతుల్యంగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందడమే కాకుండా భోజనం చేసిన తర్వాత సంతృప్తి కలుగుతుంది. మధ్య మధ్యలో చిరుతిళ్లు తినే అలవాటు, అతిగా తినడం తగ్గే అవకాశం ఉంటుంది.

డయల్ 100ను ఆశ్రయించే వారికి నిరీక్షణే

హైదరాబాద్: ప్యాట్రోలింగ్, బ్లూకోల్ట్స్ పేరిట ప్రత్యేక సిబ్బంది, ఆధునాతన వాహనాలు అందుబాటులో ఉన్న నగర పోలీసు విభాగంలో డయల్? 100ను ఆశ్రయించే వారికి నిరీక్షణే మిగులుతోంది. ముఖ్యంగా రాత్రి వేళ ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. విధుల్లో ఉండే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆగస్టు 1వ తేదీ అర్ధరాత్రి ఐకియా సమీపంలో రోడ్డు ప్రమాదం అనంతరం బాధితుడు డయల్ 100కు కాల్ చేసి సాయం కోరాడు. రాత్రి విధుల్లో ఉన్న గచ్చిబౌలి హెడ్ కానిస్టేబుల్ ఘటనాస్థలికి వెళ్లనే లేదు. సాంకేతిక కారణాలు సాకుగా చూపి 2 ఫిర్యాదుల్ని క్లోజ్ చేశాడు. విషయం గుర్తించిన సీపీ రమేశ్ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.నిర్లక్ష్యమే కారణమా : డయల్ 100కు సమాచారం అందాక సగటున 5–8 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకుంటున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. శివారులో సగటున అరగంట సమయానికి చేరుతున్నారు. డయల్ 100 ఫిర్యాదు విషయంలో స్పందన ఆలస్యం కావొద్దనే ఉద్దేశంతో పోలీసు శాఖ కొన్ని మార్పులు తీసుకొచ్చింది. డయల్ 100కు ఫోన్



చేసిన వ్యక్తి లైన్లో ఉండగానే స్థానిక పోలీస్ స్టేషన్?కు సమాచారం చేరేలా మార్పులు చేశారు.దానిద్వారా ప్యాట్రోలింగ్, బ్లూకోల్ట్ సిబ్బంది అప్రమత్తమై ఘటనాస్థలానికి చేరుకుంటారని పోలీసు శాఖ ఉద్దేశం. కానీ రాత్రివేళ విధుల్లో సిబ్బంది కొన్ని ఫోన్లను సీరియస్‌గా తీసుకోకపోవడం, రోడ్డు ప్రమాదాలను పట్టించుకోకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో డయల్? 100కు సరిగా స్పందించడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు.ఫిర్యాదుదారుల సమాచారం: ఆలస్యంగా స్పందించడం ఒక కారణమైతే సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు బయటకు రావడం ఇబ్బందికరంగా మారుతోంది. అర్ధరాత్రి వేళ కాలనీల్లో బ్యాండ్? మోతలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి బ్యాచ్?లు, అల్లరి చేసే వ్యక్తుల గురించి స్థానికులు డయల్ 100కు సమాచారం ఇస్తుంటారు. పోలీసులు వెళ్లి అల్లరి మూకల్ని అదుపులోకి తీసుకుంటున్నా ఎవరు ఫిర్యాదు చేశారో చెబుతున్నారు. దీంతో తమపై ఎందుకు ఫిర్యాదు చేశావంటూ నిందితులు, బాధితులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు.మేడ్చల్ మునీరాబాద్‌లో వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని జులై 29న స్థానికులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, పది నిమిషాల్లో వస్తున్నామని చెప్పి గంటన్నర వరకు వెళ్లలేదు. మరో పోలీసు స్టేషన్‌లో ప్యాట్రోలింగ్‌కు వెళ్లడం వల్లే ఆలస్యం జరిగినట్లు సిబ్బంది స్థానికులకు బదులిచ్చారు.24 గంటల పాటు సేవలు : రాష్ట్రంలోని ఫిర్యాదులు 24 గంటలపాటు నేరుగా హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. ఓ వైపు స్పందించని సిబ్బంది, మరో నూరు శాతం సేవలు పోలీసులు సేవలు అందిస్తున్నారు. కంట్రోల్ రూమ్ నుంచి జిల్లాలోని పోలీస్? స్టేషన్‌లకు చేరవేస్తుంటారు. ఫిర్యాదు అందుకున్న ఠాణా పరిధిలోని బ్లూకోర్ట్స్?, పెట్రోలింగ్? సిబ్బంది ఆయా పరిధిలోకి 5 నుంచి 10 నిమిషాల వ్యవధిలో ఘటన స్థలానికి చేరుకుంటారు. ఇలా రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనేక మందిని డయల్?-100 ద్వారా వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు సకాలంలో ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు రక్షించారు. ఫిర్యాదు నుంచి సమస్య పరిష్కారం వరకు డయల్?-100 విభాగం అధికారులు పర్యవేక్షిస్తుంటారు.“కమిషనరేట్? పరిధిలోకి వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై స్పందిస్తాం. డయల్-100కు వచ్చే ఫిర్యాదులపై మరింత శ్రద్ధ వహిస్తున్నాం. కాల్స్? వచ్చిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పూర్తిస్థాయి సమాచారం సేకరించి అత్యవసర సేవలు అందించడానికి ముందుంటాం. డయల్?-100లో ఫిర్యాదులు చేసినా తమ సిబ్బంది స్పందించకుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి” –

ఆర్ఎస్ ప్రవీణ్.. కల్వకుంట్ల కుటుంబానికి ఊడిగం చేస్తున్నారు

హైదరాబాద్, ఆగస్టు 5: బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. (బుధ వారం) మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టు లో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపిం చారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు.ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులో ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుంబానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసులు ఎప్పుడు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని



నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

ఫేక్ ఎన్ఓసి లపై విచారణ జరుగుతోంది: అభిలాష అభినవ్

హైదరాబాద్: ఇంటర్మీడియట్ కాలేజీలకు ఫైర్ ఎన్ఓసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఫైర్ ఎన్ఓసి హైడ్రాతో సంప్రదించి పరిశీలి ంచగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తిం చామన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ చీజల వ్యవహారంపై విచారణ కొనసాగు తోందని, విచారణ పూర్తయిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు.ఫేక్ చీజలపై కఠిన చర్యలునకిలీ ఫైర్ చీజల విషయంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభిలాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీల పై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని



పేర్కొన్నారు.విద్యార్థులు ఆందోళన చెందొద్దు ఫేక్ ఎన్ఓసిల వ్యవహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు పొందినట్లు ఇంటర్మీడి యట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లోనూ అడ్వాన్స్ టికెటింగ్ - మెట్రో తరహాలో ముందస్తుగా బుకింగ్

హైదరాబాద్: హైదరాబాద్ నగర ప్రయాణికుల సౌకర్యం కోసం టీజీఎస్ ఆర్టీసీ సరికొత్త విధా నం అందుబాటులోకి తీసుకువస్తుంది. బస్సు ఎక్కే ముందే టికెట్ (అడ్వాన్స్, బోర్డింగ్ టికెట ్ింగ్) పాలసీని త్వరలో ప్రవేశపెట్టనుంది. హైద రాబాద్ మెట్రో రైలు తరహాలో ఈ విధానం ఉం టుంది. మీ టికెట్ యాప్‌లోనే ఈ ఫీచర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు విశ్వసనీయ సమా చారం. దీంతో పాటు విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌లను జారీ చేసేందుకు ఆర్టీసీ తీవ్ర కసరత్తు చేస్తోంది.23 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3200కి పైగా బస్సుల్లో రోజూ 26 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో 70 శాతం మంది మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణికులే. రోజూ ఆర్టీసీకి రూ.6.5 కోట్ల ఆదాయం వస్తోంది. ఇందులో 23 శాతం డిజిటల్ చెల్లింపులే ఉంటున్నాయి. తాజా విధానంతో డిజిటల్ చెల్లింపుల సంఖ్య



మరింత పెరగనుంది. నిత్యం ఉదయం, సా యంత్రం బస్సుల్లో అడుగు పెడదామంటే విప రీతమైన రద్దీతో భయమేస్తుంది. అంతలా ఉం టోంది రద్దీ. ఆ సమయంలో సీటు దొరక్క నిల్చుని జనాల మధ్య నుంచి టికెట్ తీసుకో వడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. మొబైల్ యాప్‌లో బోర్డింగ్ స్టాప్ : కొన్నిసార్లు డిజిటల్ చెల్లింపుల్లో టెక్నికల్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ క్రమంలో టికెట్ జారీలో ఆలస్యమై బస్సు వేగం, షెడ్యూల్‌పై వేగంగా ప్రభావం పడుతోంది. ప్రయాణానికి ముందే టికెట్ తీసుకోవడం ద్వారా అటు కండక్టర్లు, ఇటు ప్రయాణికులకు చాలా రకాల ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రయాణికులు వారి మొబైల్ యాప్‌లో బోర్డింగ్ స్టాప్, గమ్యస్థానం ఎంచు కొని యూపీఐ లేదా కార్డ్‌తో ముందే టికెట్‌ను బుకింగ్‌ను చేయవచ్చు. గమ్యం యాప్ ద్వారా బస్సులు ఎక్కడున్నాయో ట్రాక్ చేస్తూ టికెట్‌లో పేర్కొన్న సమయం ఆధారంగా ప్రయాణికులు వారి ప్రయాణాలను ముందస్తుగానే ప్లాన్ చేసుకోవచ్చు.విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌ల జారీ : ఆర్టీసీ ప్రవేశపెట్టిన డిజిటల్ బస్‌పాస్ లకు ప్రయాణికులచేసుకోవచ్చు.విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌ల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఫిబ్రవరి 25న ప్రారంభించగా ఇప్పటివరకు 14 వేల మందిని ఈ డిజిటల్ పాస్‌లను వినియో గించుకున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీంతో రూ.2 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ప్రస్తుతం ఇందులో సిటీ ఆర్డినరీ, మెట్రో డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, పుష్పక్ బస్‌పాస్‌లు, టీ-24 టికెట్లు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. తాజాగా విద్యార్థుల బస్‌పాస్‌ల జారీకి ఆర్టీసీ నిర్ణయించింది. దీంతో బస్‌పాస్ కౌంటర్ల వద్ద రద్దీ, సిబ్బందిపై చాలా వరకు భారం తగ్గనుంది.చిలకలగూడలో కొత్త బస్ టెర్మినల్ : హైదరాబాద్?లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ ముమ్మర చర్యలు చేపడుతోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లోని రద్దీని తగ్గించేందుకు చిలకలగూడలో కొత్త బస్ టెర్మినల్, ఛార్జింగ్ స్టేషన్‌ను నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సౌత్ సెంట్రల్ రైల్వే, ఆర్టీసీల మధ్య కుదిరిన ఉమ్మడి భూ బదిలీ ఒప్పందం ఆధారంగా ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుంది.

హైదరాబాద్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంక్టాక్ట్ క్యారేజ్ వాహనాల నిర్వాహకులు

హైదరాబాద్:హైదరాబాద్ నగరంలో కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండదు, పీ యూసీ(పొల్యూషన్ అండర్ కంట్రోల్) సర్టిఫికెట్ తీసుకోరు. చివరికి పర్మిట్ కూడా లేకుండానే రోడ్లెక్కుతున్నాయి. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో ఇన్సూరెన్స్ చేయని వాహనాలే ఎక్కువగా ఉంటు న్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో స్థానంలో పీయూ సీ లేనివి, పర్మిట్ లేనివి ఉన్నాయి. మధ్యలో ఎవరినీ ఎక్కించుకోకుండా ప్రయాణికులను ఒకచోటు నుంచి మరో చోటుకు చేరవేసే ఈ కాంట్రాక్ట్ క్యారేజ్‌లకు పర్మిట్ లేకపోవడంతో ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 116 కేసులను సంబంధిత అధికారులు నమోదు చేశారు.టూరిస్టు బస్సులు, వ్యాన్లు, నగరం నుంచి దూరప్రాంతా



లకు వెళ్లే ప్రైవేటు బస్సులు కూడా కాంట్రాక్ట్ క్యారేజ్‌ల విభాగంలోకే వస్తాయి. ప్రైవేటు బస్సు లు పేరుకు కాంట్రాక్ట్ క్యారేజ్‌లు అయినప్పటికీ అవి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆపుతూ ప్రయాణికులను ఎక్కిం చుకుం టున్నాయి. అధికశాతం ఆటోలు ఈ విభాగంలోనే ఉన్నా యి. రాత్రి 10 తర్వాతే ట్రావెల్స్ బస్సులు రోడ్లపైకి రావాలని ట్రాఫిక్ అధికారులు సూచిం చినప్పటికీ 9 గంటల నుంచే రహదారులపైకి రావడంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.బీమా చేయడం తప్పనిసరి : ఇన్సూరెన్స్ లేని వాహనం ప్రమాదానికి గురై ఇతరులకు నష్టం కలిగించినట్లయితే సంబంధిత వాహన యజమానే బాధితుడికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అందుకే చాలామంది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌తో సరిపెడుతున్నారు. కొందరు అవీ తీసుకోవడం లేదు. నిత్యం తిరిగే ట్రావెల్స్ బస్సులకు బీమా చేస్తారు. ఆటోలు, ఇతర చిన్న వాహనాలు, స్థానికంగా తిరిగే వాహనదారులు అదో అదనపు భారంగా భావిస్తుంటారు. ఇన్సూరెన్స్ తప్పక చేయించుకోవాలి. అది వాహన యజమాని, డ్రైవర్‌ను ఆదుకునే రక్షాపత్రం అని చెప్పవచ్చు.గత 7 నెలల్లో వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకపోతే రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు ఒక్కో జోన్ పరిధిలో సగటున సుమారు 375 చొప్పున కేసులు నమోదయ్యా యి. ఇతర నిబంధనల ఉల్లంఘన కింద ఒక్కో ల 150కి పైగానే కేసులు నమోదయ్యాయి.

గాంధీభవన్‌కు చేరిన కాంగ్రెస్ నేతల వర్గపోరు..

హైదరాబాద్:కాంగ్రెస్ పార్టీ అంటే ఎవరి కుంపటి వారిదే అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. గ్రూపు రాజ కీయాలకు కేరాఫ్ అడ్రస్ ఏంటంటే కాంగ్రెస్ పార్టీ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఎప్పుడూ ఏదో ఒక చోట గ్రూప్ వార్ బయటకు వస్తూనే ఉంటుంది. తాజాగా కొమురం భీం



ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు రచ్చకెక్కాయి.ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నూతన మండల అధ్యక్షుల ప్రకటనలో డీసీసీ అధ్యక్షు రాలు సుగుణక్క ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు వర్గం ఫైర్ అవుతోంది. పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్లను కాదని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ వాట్సాప్ గ్రూపుల్లో రెండు వర్గాల మధ్య మాటల యుద్ధం నెలకొంది. ఆ యుద్ధం సెగ కాస్తా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తాకింది.

రోడ్డును తీసుకుంటే..ఊరును తీసుకోవాలని గ్రామస్థుల ధర్నా



ఆదిలాబాద్ : ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టు( ) కోసం తమ గ్రామ రోడ్డును తీసుకుంటే మొత్తం గ్రామాన్ని తీసుకోవాలని కోరుతూ అనుకుంటా గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి బైఠాయించి నిరసన తెలిపారు.ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న తమ భూములకు రూ.6 కోట్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.గ్రామస్థులు ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోవాలంటే కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ప్రయాణం చేస్తుండగా రోడ్డు ఎయిర్‌పోర్టులో పోతే 16 కిలోమీటర్లు దూర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు. రోడ్డుతో పాటు తమ గ్రామాన్ని మొత్తం తీసుకొని ఇతర ప్రాంతంలో తమకు పునరావసం కల్పించాలని కోరారు.

142 ఫైర్ ఎన్ఓసీల్లో 52 నకిలీవే

హైదరాబాద్:హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీకి గురైంది. పలు ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు అక్రమంగా ఫైర్ ఎన్ఓసీలు పొందేందుకు ఆయన సంతకం ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. పలువురు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే ప్రైవేట్ కాలేజీలు ఇంటర్‌బో ర్డుకు ఫైర్ ఎన్ఓసీలు సమర్పించినట్లు వెల్లడైం ది. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని మొత్తం 142 ఫైర్? ఎన్?ఓసీల్లో 52 నకిలీవేనని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు అధికారులు మంగళవారం ఫిర్యాదు చేశారు.జీహెచ్?ఎంసీ కమిషనర్ సంతకమూ ఫోర్జరీ : అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల కోసం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు కీలక అధికారుల సంతకాలను కూడా పలు కాలేజీ యాజమాన్యాలు ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. గతంలో అగ్నిమాపక శాఖలో పనిచేసి బదిలీ అయిన ఉన్నతాధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సంతకాలు కూడా ఫోర్జరీ జరిగినట్టు తేల్చారు. అయితే ఈ



వ్యవహారంలో సూత్రధారులెవరు? పాత్రదారులెవరు అనే కోణంలో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.90లో 52 నకిలీ ఎన్?ఓసీలే : తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో 142 జూనియర్ కళాశాలలు ఫైర్ ఎన్ఓసీలు సమర్పించాయి. అందులో 90 వరకు ఒరిజనల్‌వి ఉండగా 52 ధ్రువపత్రాలు నకిలీవేనని తేలింది. వీటిని సమర్పించిన వారిపై తదుపరి చర్యలకు ఉద్దేశించి జులై 4న నెక్లెస్ రోడ్డులోని లేక్ పోలీసు స్టేషన్లో కేసు కూడా హైడ్రా నమోదు చేసింది. 2025-26, 2026-27 విద్యా సంవత్సరాలకు సంబంధించి జూనియర్ కళాశాల ల యాజమాన్యాలు సమర్పించిన ఫైర్ ఎన్ఓసీల ప్రతులన్నిటినీ హైడ్రా నిశితంగా పరిశీలించగా ఈ విషయం వెల్లడైంది.సింహభాగం నకిలీ? ధ్రువపత్రాలే : మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు (డీఐఈవో) మొత్తం 76 ఫైర్ ఎన్ఓసీలను ప్రామాణికత నిర్ధారణ కోసం పంపించారు. వాటిని హైడ్రా కార్యాలయ రికార్డులతో పరిశీలించగా, 7 ఫైర్ ఎన్ఓసీలు నకిలీవని తేలింది. రెండో దశలో సంబంధిత జిల్లా డీఐఈవోలు మొత్తం 66 ఫైర్ ఎన్ఓసీలను ధ్రువీకరణ కోసం పంపించారు. వీటిని కూడా హైడ్రా కార్యాలయ రికార్డులతో పరిశీలించగా, 45 ఫైర్ ఎన్ఓసీలు నకిలీవేనని తేలింది. ఈ మేరకు ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డుకు హైడ్రా సూచించింది.ఫోర్జరీ ఎన్ఓసీలు పొందిన పలు కాలేజీలివే : హైదరాబాద్?లో కీలక ప్రాంతా ల్లోని పలు ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు ఫైర్ ఎన్ఓసీల కోసం ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. తొలి విడత తనిఖీల్లో మెహిదీపట్నంలో ప్రియాంక ఇంటర్మీడియట్ కాలేజీ, విద్యానగర్?లోని మదర్స్ గర్ల్స్, చాంద్రాయణగుట్టలోని శ్రీచంద్ర, చిక్కడపల్లిలోని న్యూ ఎరా, శివరాంపల్లిలోని షాహీన్, తెల్లాపూర్‌లోని వశిష్ట, బర్కత్‌పురాలోని హైందవి, ఎస్ఆర్‌నగర్‌లోని రెజోనెన్స్ కాలేజీలు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే నకిలీ ఎన్ఓసీలను ఇంటర్ బోర్డుకు పంపించినట్లు అధికారులు గుర్తించారు.బోర్డులోని అధికారులు కుమ్మక్కు? : ఉన్నతాధికారుల సంతకాల ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపు కూడా రద్దు చేయాలని హైడ్రా అధికారులు ఇంటర్‌బోర్డును కోరారు. అయితే కొందరు ఇంటర్‌బోర్డులోని అధికారులు కూడా ఈ వ్యవహారంలో కుమ్మక్కైనట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మొత్తంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. దర్యాప్తులో ఎటువంటి విషయాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సి ఉంది.

ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదు

అమరావతి, ఆగస్టు 5: హిందూ దేవుళ్లపై సోషల్ మీడియాలో పోస్ట్‌లు, నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై సైబర్ డీజీ రవిశంకర్‌కు బీజేపీ నేతల బృందం ఫిర్యాదు చేసింది. 57 మంది వివరాలతో బీజేపీ నేతలు భానుప్రకాశ్ రెడ్డి, వల్లూరు జయప్రకాశ్, షేక్ బాజీ, శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్ మాట్లాడుతూ.. భారత సంస్కృతిలో శ్రీరామచంద్రుడిని ఆరాధ్య దైవంగా చూశామని.. దేవతా మూర్తులు మాతా సరస్వతి, లక్ష్మీదేవి, సీతమ్మను తల్లిగా భావిస్తున్నామని తెలిపారు.హిందూ దేవుళ్లపై అనరాని మాటలు అంటున్నారని భాను ప్రకాశ్ మండిపడ్డారు. ఆ వీడియోలను చూడలేకపోయామన్నారు. హిందూ దేవుళ్లను ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. 'ఒళ్లు జాగ్రత్త, తోలు తీస్తాం! వదిలే ప్రసక్తే లేదు!' అని హెచ్చరించారు. హిందూ దేవుళ్లపై ప్రకాశ్ రాజ్



నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శ్రీరామచంద్రుడు ఉత్తర దేశం నుంచి దక్షిణ దేశానికి వచ్చారని, పండ్లు దొంగిలించారని చెబుతున్నారని ఫైర్ అయ్యారు. దమ్ము, ధైర్యం ఉంటే అన్యమతస్తుల్లో జరుగుతున్న అన్యాయాల గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. కేవలం హిందూ మతం, హిందూ దేవుళ్లపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని.. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలని భానుప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

వైఎస్సార్సీపీ నేత మల్ల విజయప్రసాద్ నివాసాలు, కార్యాలయాలపై ఈడీ దాడులు

విశాఖ: మంత్రి నారా లోకేశ్ విశాఖలో పర్యటించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి "పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్" నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీవీ సింధు మాట్లాడారు. ఏ సంస్థకైనా నిజమైన పునాది స్పష్టమైన లక్ష్యమేనని, ఈ క్రీడా ప్రాజెక్ట్ రూపకల్పనలో తనకు అండగా నిలిచి, పూర్తి మద్దతు అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీనిని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో 25 మీటర్ల ఇండోర్ షూటింగ్ రేంజ్, 7 ప్రధాన క్రీడా విభాగాలు, నూతన క్రీడాంశాలు అందుబాటులో ఉండనున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేయనున్న 25 మీటర్ల స్విమ్మింగ్ పూల్‌ను, ఒలింపిక్స్ పోటీల్లో వాడే "మిర్తా పూల్స్" (ఇటలీ) ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు విశాఖకు చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఇతర



ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలను కలిసి లోకేశ్ అర్జీలు స్వీకరించారు.హైదరాబాద్‌లోనూ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఏ సంస్థకైనా నిజమైన పునాది స్పష్టమైన లక్ష్యమే. ఈ క్రీడా ప్రాజెక్ట్ రూపకల్పనలో అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్. ఈ ప్రాజెక్ట్‌లో 25 మీటర్ల ఇండోర్ షూటింగ్ రేంజ్ అందుబాటులో ఉంటుంది. ఏడు ప్రధాన క్రీడా విభాగాలు, నూతన క్రీడాంశాలు అందుబాటులో ఉండనున్నాయి. 25 మీటర్ల స్విమ్మింగ్ పూల్, ఒలింపిక్స్‌లో వాడే మిర్తా పూల్స్ ప్రమాణాలతో నిర్మిస్తున్నాం. విశాఖలో క్రీడాకారులకు అనేక అవకాశాలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు క్రీడాకారులకు అనేక అవకాశాలు కల్పిస్తున్నాం. విశాఖలో సెంటర్ నిర్మాణానికి లోకేశ్ శంకుస్థాపన చేయడం సంతోషం. – పీవీ సింధు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణిప్రపంచ స్థాయి క్రీడాకారులకి ఈ సంస్థ వేదిక కానుంది: పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు లోకేశ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడారు. అకాడమీ ద్వారా ప్రతిభను మరింత మెరుగుపరచుకోవచ్చు అన్నారు. ఏ సదుపాయాలు లేని రోజుల్లోనే ఒలంపిక్ పతక విజేతగా సింధు ఎదిగారు అని కొనియాడారు. పట్టుదల, క్రమశిక్షణతో సింధు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచారన్నారు. ప్రతి ఛాంపియన్ వెనుక తల్లిదండ్రులు, కోచ్‌లు ఉంటారన్నారు. అన్ని క్రీడలకు కేంద్రంగా అకాడమీని తీర్చిదిద్దాలనేది సీఎం ఆలోచన లోకేశ్ తెలిపారు. ప్రపంచస్థాయి క్రీడాకారుల తయారీకి ఈ సంస్థ వేదిక కానుందని లోకేశ్ పేర్కొన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద - 118 టీఎంసీలు దాటిన నీటిమట్టం

శ్రీశైలం: జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2.45 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 863.90 అడుగులకు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 118.6216 టీఎంసీలుగా ఉంది. ఈ క్రమంలోనే అధికారులు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. విద్యుత్ ఉత్పత్తి చేసి 4267 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్?కు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.మరోవైపు తుంగభద్ర జలాశయానికి సైతం భారీగా వరద ప్రవాహం వస్తోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమ



యానికి 1,02,698 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రస్తుతం డ్యాంలో 54.42 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి వరద ప్రవాహం వస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఏటా ఆగస్టు నెలలో తుంగభద్ర జలాశయంలో నీరు గరిష్టస్థాయికి చేరి, క్రస్ట్ గేట్ల నుంచి దిగువన నదిలోకి విడుదల చేసేవారు. అదే విధంగా రైతులు వరి నారు పోసుకోవడానికి కూడా జులైలోనే నీటిని విడుదల చేసేవారు.ఈసారి సూపర్ ఎల్?నినో ప్రభావంతో కర్ణాటకలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తి తుంగభద్ర జలాశయానికి ప్రవాహం రాలేదు. దీంతో ఇప్పటి వరకు కేవలం 60 టీఎంసీలు మాత్రమే వచ్చింది. మరో 15 టీఎంసీల నీరు రానుందని అధికారులు అంచనా వేస్తున్నారు.టీఎంసీల నీరు రానుందని అధికారులు గత 24 గంటలుగా జలాశయంలోకి లక్ష క్యూసెక్కుల మేర వరద వస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టి రేపటి నుంచి వరద కొంత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా నీరు జలాశయానికి చేరుతోందని చెబుతున్నారు.

ప్రకాశం జిల్లా అభివృద్ధికి REMZ ప్రాజెక్ట్ కీలకం

ప్రకాశం, ఆగస్టు 5: జిల్లాలోని అద్దంకి ప్రాంతంలో రెన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్() ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ. భూములు ఇచ్చిన రైతులకు పారదర్శకంగా రూ.31.57 లక్షల పరిహారం అందించామని చెప్పారు. సోలార్ విద్యుత్ తయారీ కేంద్రం రాష్ట్రంలోనే కీలక పారిశ్రామిక ప్రాజెక్టుగా రూపుదిద్దుకోనుందని అన్నారు. ఇప్పటికే పలువురు పెట్టుబడిదారులు, కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.రాష్ట్రంలో 20 లక్షల



ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. పారిశ్రామి కాభివృద్ధితో పాటు రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం సమానంగా కాపాడ ుతోందన్నారు. ప్రకాశం జిల్లాను పారిశ్రామిక ంగా అభివృద్ధి చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. 2027 వరకు శ్రీశైలం జలాలను భద్రపరుచుకోవాలి



అమరావతి, ఆగస్టు 5: రాయలసీమ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను తాగునీటి కోసం భద్రపరచుకోవాలని అన్నారు. నేటికి శ్రీశైలం వద్ద ఉన్న 119 టీఎంసీలకు తోడు, రాబోయే 10 రోజులలో మరొక 100 టీఎంసీల వరకు ఇన్ ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. కృష్ణా జలాల్లో ఏపీ 63 శాతం వాటాను ప్రథమంగా తాగునీటికే ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిని ఎల్‌నినో దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యంగా తాగునీటికి విడుదల చేస్తున్నామని తెలిపారు.హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి అవసరాల కోసం 13 టీఎంసీలు అవసరమని మంత్రి వెల్లడించారు. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి కోసం10 టీఎంసీలను రేపటి నుంచి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

ప్రపంచ స్థాయి క్రీడాకారులను పీవీ సింధు అకాడమీ తయారు చేస్తోంది

విశాఖపట్నం, ఆగస్టు 5 : ప్రపంచ స్థాయి క్రీడాకారులను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అకాడమీ తయారు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. యువత ముఖంలోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని పేర్కొన్నారు. పీవీ సింధు అకాడమీ ద్వారా క్రీడాకారులు వారిలోని ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఎలాంటి సదుపాయాలు లేని రోజుల్లోనే పట్టుదల, క్రమశిక్షణతో సింధు ఒలింపిక్స్ పతక విజేతగా, ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగారని ఉద్ఘాటించారు. విశాఖపట్నం అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో తలపెట్టిన పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు మంత్రి నారా లోకేశ్ ఈరోజు (బుధవారం) భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు.క్రీడలకు నిలయంగా ఈ అకాడమీ..ప్రతి ఛాంపియన్ వెనుక కష్టపడిన తల్లిదండ్రులు, ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలిచే కోచ్‌లు ఉంటారని మంత్రి



లోకేశ్ వ్యాఖ్యానించారు. కేవలం బ్యాడ్మింటనే కాకుండా, అన్ని రకాల క్రీడలకు కేంద్రంగా ఈ అకాడమీని తీర్చిదిద్దాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ అకాడమీ రూపుదిద్దుకుంటోందని వివరించారు. ఈ సంస్థ బ్యాడ్మింటన్‌కే పరిమితం కాకుండా.. స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడలకు కూడా నిలయంగా మారనుందని వెల్లడించారు. ఆస్ట్రేలియా, ఖతార్ తరహాలో మన దేశంలోనూ ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ఈ సంస్థ వేదిక కానుందని తెలిపారు.విశాఖపట్నంలో ఈ అకాడమీ నిర్మాణం విజయవంతం కావడానికి తమ ప్రభుత్వం, ప్రజల సహకారం ఎప్పుడూ ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 90వ దశకంలోనే క్రీడలపై సీఎం చంద్రబాబు నమ్మకం ఉంచారని ప్రస్తావించారు. ఆ మేరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పించి క్రీడా విప్లవానికి చంద్రబాబు బాటలు వేశారని ఉద్ఘాటించారు. ఈ అకాడమీ కేవలం బ్యాడ్మింటన్ మాత్రమే కాకుండా, అనేక క్రీడలకు కేంద్రంగా మారి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా సంస్కృతిని పెంచుతుందని వివరించారు. తరగతి గది జ్ఞాబ్యాడ్మింటన్ మాత్రమే కాకుండా, అనేక నాన్ని ఇస్తే, క్రీడలు మనకు వ్యక్తిత్వాన్ని, పోరాట పటిమను నేర్పుతాయని చెప్పుకొచ్చారు. అందుకే ఏపీలో ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ప్రకటించామని తెలిపారు. ప్రతి చిన్నారిలోనూ ఒక సహజ ప్రతిభ దాగి ఉంటుందని వివరించారు. దానిని వెలికితీసి ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

రౌడీయిజాన్ని ప్రదర్శించడం వైసీపీ రాజకీయ సంస్కృతిగా మారింది

అమరావతి, ఆగస్టు 5: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పర్యటనలో వైసీపీ గొడ్డలిపార్టీ శ్రేణులు బస్సులు అడ్డుపెట్టి, సైలెన్సర్లు తొలగించి బలప్రదర్శన చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించాయని ధ్వజమెత్తారు. రౌడీయిజాన్ని ప్రదర్శించడం వైసీపీ రాజకీయ సంస్కృతిగా మారిందని ఎద్దేవా చేశారు. (బుధవారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి సుభాశ్ మాట్లాడారు. పొగాకు రైతుల సమస్యలపై మాట్లాడే నైతిక అర్హత జగన్‌కి లేదని చెప్పుకొచ్చారు.వైసీపీ హయాంలో కేవలం 12.9 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు జరిగిందని ప్రస్తావించారు. ప్రస్తుత ప్రభుత్వం 28.9 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులకు మద్దతుగా నిలిచిందని



తెలిపారు. పొగాకు కొనుగోళ్ల ద్వారా రైతులకు సుమారు రూ.270 కోట్ల ఆర్థిక ప్రయోజనం తమ కూటమి ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల పతనం, యుద్ధ పరిస్థితులు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం రైతులకు అండగా ఉందని చెప్పుకొచ్చారు.కిలోకు రూ.10 ప్రోత్సాహక సాయం అందిస్తూ ప్రభుత్వం సుమారు రూ.100 కోట్ల భారం ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. రైతులకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే అంశంపై కేంద్రంతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెడు తుంటే, జగన్ మాత్రం బలప్రదర్శనలు, రాజ కీయ ఆరోపణలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రచారానికే గొడ్డలి పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి సుభాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశంలో ఎక్కడా బీసీల కోసం ప్రత్యేక చట్టం లేదు

అమరావతి, ఆగస్టు 5: బీసీల కోసం ప్రత్యేక చట్టమంటూ దేశంలో ఎక్కడా లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈరోజు(బుధవారం) బీసీ రక్షణ చట్టంలోని వివరాలను మీడియాకు మంత్రి వెల్లడించారు. బీసీల కోసం కొత్తగా తెచ్చే చట్టంపై రెండేళ్ల నుంచి తీవ్ర కసరత్తు చేశామని తెలిపారు. 2019-24 కాలంలో బలహీనవర్గాలపై కక్షకట్టి దమనకాండ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలహీనవర్గాల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని మేనిఫెస్టోలో పెట్టామని అన్నారు. సమస్యల పరిష్కారానికి సబ్‌కమిటీ కూడా నియమించామన్నారు. సమాజంలో బలహీనవర్గాలకు ఉన్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు.బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది అన్న ఎన్టీఆర్ అని.. ఆ రిజర్వేషన్లను 27 శాతానికి పెంచింది చంద్రబాబు నాయుడు అని మంత్రి చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో బలహీనవర్గాలు 70 శాతం మంది ఉన్నారని తెలిపారు. ఈ చట్టాన్ని అన్ని విధాల అమలులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. జిల్లాల వారీగా బలహీనవర్గాల సంఘాలతో మాట్లాడాలని సబ్ కమిటీకి చెప్పామని తెలిపారు. కొత్త చట్టాన్ని ప్రజలకు వివరించి సలహాలు తీసుకోవాలని ఆదేశించామని చెప్పారు. టీడీపీ వెన్నంటే ఉంది బలహీనవర్గాలే అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

Edited,Printed,Published and Owend by Mare Chinababu ,Printed at sravanthi prienters , rtc crss road ,Hyderabad-500001.
Published at:6-3-4, Premnagar,Behind ASHOK MALL, Banjara Hills, Road#1, Hyderabad-500 034, Telangana.